క్లుప్తంగా

క్రమశిక్షణతో మంచి ఫలితాలు

బిక్కవోలు: క్రమశిక్షణతో మంచి ఫలితాలు వస్తాయని పందలపాక ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తుందన్నారు. విద్యార్థులంతా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఉపాధ్యాయులే కాకుండా ఇంటి వద్ద తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువు విషయంలో బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

420 మందికి వైద్యసేవలు



పురుషోత్తపట్నంలో ఇంటి వద్ద రోగికి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 420 మందికి వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్లు వెంకట కుమారి, లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కొత్త సబ్‌స్టేషన్ లైన్ల పనుల నిమిత్తం శుక్రవారం కొంకుదురు, పందలపాక గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు.

సమాజ సేవ జీవితంలో భాగం కావాలి

రంగంపేట: ప్రతిఒక్కరి జీవితంలో సత్యసాయి నామస్మరణ, సమాజ సేవ భాగం కావాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప అమరనాథ్ సూచించారు. గురువారం మండలంలోని కొత్త కోటపాడులో సత్యసాయి సేవా సదన్ 28వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రశాంతి పతాకను ఆవిష్కరించి, బాబా పాదుకలకు, చిత్రపటానికి సహస్ర నామార్చన చేశారు. గ్రామంలో బాబా చిత్రపటాన్ని, దివ్యాంబరాన్ని ఊరేగించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. పురుషోత్తపట్నానికి చెందిన ఇనపాల జార్జి రాజు గత నెల 29న గోదావరి వరదలో కొట్టుకు వచ్చే పుల్లలను ఏరుకోవడానికి గోదావరి ఒడ్డుకు వెళ్లి ఇంటికి రాలేదు. గోదావరిలో నాలుగు రోజులు గాలించినా జాడ కనిపించలేదు. అతని భార్య మల్లికను, కుమారుడిని జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. అలాగే వంగలపూడికి చెందిన పిల్లెల రేవతి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, చల్లమళ్ల సుజీరాజు, ఎస్సీసెల్ నాయకులు అంబటి రమణ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వితరణ

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని గ్రంథాలయానికి విశ్రాంత ఉపాధ్యాయుడు యనమదల కృష్ణ రెండు బుక్‌ర్యాక్‌లు వితరణ చేశారు. శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు దాచుకోవడానికి బుక్‌ర్యాక్‌లు లేని విషయాన్ని గుర్తించిన ఆయన.. రూ 8,770తో వీటిని అందజేశారు. ఆయనకు లైబ్రేరియన్ కలగర సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో నాలుగో తరగతి చదువుతున్న తన కుమారుడిని ఏడో తరగతి చదివి మానేసిన బాలుడు రాయితో కొట్టడంతో తలకు తీవ్ర గాయమైందని తండ్రి డొక్కా సోమశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై సమర్పణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన

సీతానగరం: మిర్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉండేశ్వరపురం ఫీడర్ ద్వారా విద్యుత్ ఇవ్వడం లేదంటూ రైతులు గురువారం రాత్రి 7 గంటలకు ఆందోళనకు దిగారు. ఉండేశ్వరపురం ఫీడర్ ద్వారా త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వకపోవడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని రైతులు పోలిన సత్యనారాయణ, హనుమంతు, రుద్రు వీరబాబు, రుద్రు కాశీ, వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాలలో పూర్తిస్థాయిలో విద్యుత్ అందించాలన్నారు.

జగన్ పాలనలో పల్లెల ప్రగతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- జంబూపట్నంలో గడప గడపకూ..



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం జంబూపట్నంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ జంబూపట్నం అభివృద్ధికి నాలుగేళ్లలో రూ.3.10 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేశామన్నారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు లేనిపోని అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. తొలుత గ్రామదేవత గొడుగులమ్మను దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, బీసీ పేటల్లోని 250 గడపలు తిరిగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్న దొర, పార్టీ మండల కో కన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్లు ఉల్లి బుజ్జిబాబు, మందారపు వీర్రాజు, నాయకులు నాగా సత్తిబాబు, ఉల్లి చెల్లారావు, ఉల్లి గణ, ఈతకోట చినబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయని, తామంతా జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు కేతా సత్యశ్రీలక్ష్మి, కర్రి వెంకటపద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు జోరుగా నామినేషన్లు



రామవరం 3వ వార్డు అభ్యర్థిగా నామినేషన్ అందజేస్తున్న కర్రి రుక్మిణి కుమారి



కాండ్రేగుల సచివాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న పేపకాయల సత్యవతి

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో 1, 9 వార్డు స్థానాలకు, రామవరం గ్రామ పంచాయితీ 3వ వార్డు స్థానానికి గురువారం తొమ్మిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. దుప్పలపూడి 1వ వార్డుకు వల్లభశెట్టి శివపద్మిని, ఉండమట్ల వెంకటలక్ష్మి, కోట దీప్తి, సిరసపల్లి అమల, 9వ వార్డుకు దొండపాటి పద్మనాగ విజయదుర్గ, దొండపాటి మణికంఠ, వల్లభశెట్టి రామసతీష్, చిర్ల త్రినాథరెడ్డిలు తమ నామినేషన్లను స్టేజ్‌-1 ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.పుష్పలతకు అందజేశారు. రామవరం పంచాయితీ 3వ వార్డు స్థానానికి సంబంధించి కర్రి రుక్మిణి ఒక్కరే నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన గురువారం కర్రి రుక్మిణి కుమారి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

నాలుగు నామినేషన్లు

పెదపూడి: మండలంలోని కాండ్రేగుల గ్రామంలో 3వ వార్డు మెంబర్ స్థానానికి 4 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల స్టేజ్ 1, 2 అధికారి ఎల్.గణేష్ బాబు తెలిపారు. నామినేషన్ల చివరి రోజు పేపకాయల సత్యవతి, పబ్బినీడి రామ్మూర్తి, పేపకాయల సత్యసాయిబాబు, పేపకాయల ప్రవీణ్‌లు నామినేషన్లు దాఖలు చేశారన్నారు.

గద్దర్ సేవలు చిరస్మరణీయం

గోకవరం: ప్రజాయుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్ సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం గద్దర్ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం గద్దర్ తన కలాన్ని, గళాన్ని, ఆట, పాటలను వినియోగించారన్నారు. కార్యక్రమంలో డి.సురేష్, శ్రీకాంత్, గోలి ముసలయ్య, గుడిసె అబ్బు, కడాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

గోకవరం: స్థానిక ఎంపీపీ పాఠశాలలో గురువారం యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను సంఘ నాయకులు ఆవిష్కరించారు. యూటీఎఫ్ సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఎల్‌వీఎన్ కాశీ, ఎస్.కుమార్, కె.నాగభూషణం, కె.శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్

రంగంపేట: మండల పరిధిలోని సింగంపల్లిలో ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ శిలా ఫలకాన్ని గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ టి.శివశంకర్ ఆనంద్ ఆవిష్కరించి, జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక గొల్లవాని చెరువు గట్టుపై 75 కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, ఎంపీటీసీ ఎం.సుబ్బన్న, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం నుంచి తొస్సిపూడి వరకూ రోడ్డు పక్కన మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి రెడ్డి సత్తిరాజు, ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

గోకవరం: ఆజాదీగా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, డ్వామా పీడీ పి.అచ్యుతాంబ పిలుపునిచ్చారు. మండలంలోని కామరాజుపేట, గంగంపాలెం, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో గురువారం ఆజాదీగా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సీతానగరం: మిర్తిపాడు, ఉండేశ్వరపురం, కాటవరం, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల సచివాలయాల వద్ద శిలాఫలాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీవో కె.రమేష్, ఏపీవో నాగేషవేణి, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచ్‌లు మాకాల ఈశ్వరరావు, బంగారు సత్యవతి, సత్యవేణి, సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారిద్దాం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించిన ఎమ్మెల్యే



విద్యార్థినులతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కోటికేశవరంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

అనపర్తి: చిన్నారులను రక్తహీనతకు గురిచేసి శారీరక, మానసిక ఎదుగుదలకు అవరోధమయ్యే నులి పురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నివారిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం ద్వారా నులిపురుగులు శరీరంలోకి చేరే ప్రమాదముందని, అందుకే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంఈఓ–2 నల్లమిల్లి సత్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తి వెంకటరెడ్డి, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కేపీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంలు కల్యాణి, కె.సుజాత, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రంగంపేట: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని 8,075 మంది చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించామని పీహెచ్‌సీ వైద్యాధికారి డి.లావణ్య తెలిపారు.

పెదపూడి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 8,508 మందితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్యురాలు సురేఖ తెలిపారు.

బిక్కవోలు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు సర్పంచ్ సత్తి వీరమణి చేతుల మీదుగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మింగించారు.

గోకవరం: విద్యార్థులు విధిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, డాక్టర్ నిఖిత, ఎంఈఓ బి.గౌరమ్మ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెచ్ఈ శైలజ, హెచ్‌వీ సుజాత పాల్గొన్నారు.

రాజానగరం నియోజకవర్గంలో..

రాజానగరం: నులిపురుగుల నివారణకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో 95 శాతం మంది పిల్లలకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి. రవికుమార్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని ఒకటి నుండి 19 ఏళ్ల వయసున్న 24,348 మందికిగాను 22,938 మంది విద్యార్థులకు ఈ మాత్రలు అందజేశామన్నారు. మిగిలిన వారికి కూడా ఈనెల 17న నేరుగా కలుసుకుని అందజేస్తామన్నారు. పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో 10,549 మంది విద్యార్థులకుగాను, 10,021 (95 శాతం) మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేశామని డాక్టర్ బెనిడిక్ట్ తెలిపారు.

మధురపూడి: కోరుకొండ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 11,500 మంది విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ వేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కుశలవ దొర, కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యకాంతి, ఉపాధ్యాయులు, ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల్లో సుమారు 13 వేల మంది పిల్లలు ఉండగా వారిలో 92 శాతం మందికి నులి పురుగుల నివారణ మాత్రలు వేసినట్టు డాక్టర్ చైతన్య తెలిపారు. సీతానగరం ఎంపీపీ స్కూల్లో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, వైస్ సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు తదితరులు విద్యార్థులతో భోజనం అనంతరం మాత్రలను మింగించారు.

అక్రమాస్తులను నిరూపించే సత్తా ఉందా!

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు
- చంద్రబాబుపై జక్కంపూడి విజయలక్ష్మి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: జక్కంపూడి కుటుంబం అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకుని, విలాసవంతమైన భవనాల్లో ఉంటున్నట్టు ఆరోపణలు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు.. వాటిని నిరూపించే సత్తా ఉందా అని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రశ్నించారు. కోరుకొండ మండలం నర్సాపురం రోడ్డులోని పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు గెస్ట్‌హౌస్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల చంద్రబాబు పర్యటనలో చేసిన గ్లోబల్స్ ప్రచారంపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వంపై ప్రజలకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు నిందారోపణలు చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజల కోసమే జీవిస్తున్న జక్కంపూడి కుటుంబంపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే కుటుంబమంతా రాజకీయ సన్యాసం తీసుకుంటామన్నారు. లేకుంటే చంద్రబాబు కుటుంబం రాజకీయ సన్యాసానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన వారిని బషీర్‌బాగ్‌లోనూ, కాల్దరిలో ఇద్దరు రైతులను కాల్చి చంపించిన చంద్రబాబు మాటలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదాతకు అండగా నిలిచారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, నాయకులు ఉల్లి బుజ్జిబాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, నేతుల చిన్ని, పసుపులేటి బుల్లియ్య నాయుడు, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో కిడ్నాప్ కలకలం

- స్కూల్‌కి వెళ్లకుండా ఓ ఇంట్లో దాక్కొన్న విద్యార్థులు
- మూడు గంటల పాటు ఉత్కంఠ
- పిల్లలు దొరకడంతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



బంధువుల చెంతకు చేరిన విద్యార్థులు భవ్య, సుస్మిత

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో కిడ్నాప్ కలకలం రేగింది. విద్యార్థులు స్కూల్‌కి వెళ్లలేదని తెలియడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని గ్రామంలో ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో చిన్నారులు దాక్కొన్నట్టు గుర్తించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే...అచ్యుతాపురం ఎస్సీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మైలపల్లి నాగేంద్ర, శశికళకు చెందిన ఎనిమిదేళ్ల భవ్య, ఆరేళ్ల సుస్మిత స్థానికంగా ఉన్న ఎంపీపీ పాఠశాలలో చదువుకుంటున్నారు. వీళ్లు రెండు రోజుల నుంచి పాఠశాలలకు వెళ్లలేదు. గురువారం తల్లి వీరిని పాఠశాలకు పంపించగా వీరు స్కూల్‌కు వెళ్లలేదు. పాఠశాల ఉపాధ్యాయులు తండ్రికి ఫోన్ చేసి పిల్లలు పాఠశాలకు రాలేదని చెప్పడంతో ఆటో కిరాయికి వెళ్లిన నాగేంద్ర గ్రామానికి వచ్చి పిల్లల గూర్చి భార్యను ప్రశ్నించాడు. పిల్లలు ఇద్దరు ఉదయమే పాఠశాలకు వెళ్లారని ఆమె బదులు చెప్పడంతో కంగారు పడి తల్లిదండ్రులు ఇద్దరూ స్కూల్‌కి వెళ్లి విచారించగా స్కూల్‌కి రాలేదని తెలిసింది. విషయం స్థానికులకు కూడా తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గ్రామంలో గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ముమ్మరంగా గాలించి

ఎస్సై శివనాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో ప్రతి ప్రదేశాన్ని గాలించారు. అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. సోషల్ మీడియా ద్వారా గ్రూపుల్లో పిల్లల ఆచూకీ కోసం ఆరా తీశారు. గ్రామంలో ఉదయం సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసేవారు ఇంటింటికీ తిరిగారని సమాచారం తెలియడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో ఉదయం పాఠశాలకు వెళతామని చెప్పిన చిన్నారులు పాఠశాలకు సమీపంలో ఓ షాపు వద్ద చాక్లెట్లు కొనుక్కున్నారని గుర్తించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పిల్లలకు వరుసకు చిన్నాన్న అయిన ఓ వ్యక్తి నూతనంగా ఇంటిని నిర్మించుకోవడంతో ఆ ఇంట్లో ఓ గదిలో దాక్కొని ఉన్న వీరిని స్థానికులు గుర్తించారు. మూడు గంటల ఉత్కంఠ అనంతరం పిల్లల ఆచూకీ లభ్యమైంది. పోలీసులు ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ బాలుడిని గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లే ప్రయత్నం చేశాడని, గుర్తించిన స్థానికులు కేకలు వేయడంతో విడిచిపెట్టాడని ఇప్పుడు కూడా అటువంటి సంఘటనే జరిగి ఉంటుందని భయపడ్డామని గ్రామస్తులు తెలిపారు.

కొనసాగుతున్న గురుచరిత్ర పారాయణ



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వెళ్లే కూడలి ప్రాంతంలో కొలువుతీరిన షిరిడీ సాయిబాబాను గురువారం పలువురు భక్తులు దర్శించుకుని, పూజలు, అర్చనలు చేశారు. ఈ ఆలయంలో 11 గురువారాల పాటు నిర్వహించే గురుచరిత్ర పారాయణలో కొందరు భక్తులు పాల్గొని, అవకాశం మేరకు ఒకటి, రెండు అధ్యాయాలు పారాయణ చేశారు. ఈ కార్యక్రమం ఆరు వారాలుగా కొనసాగుతోంది. స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో ప్రతివారం వేకువజామున కాకడ హారతి ఇచ్చిన అనంతరం ప్రారంభమై మధ్యాహ్నం 2.30 గంటల వరకూ జరుగుతోంది. ఆసక్తి ఉన్న భక్తులు ప్రారంభం నుంచి చివరి వరకూ గానీ, కొన్ని అధ్యాయాలుగానీ పారాయణ చేయవచ్చునని భక్త మండలి సభ్యులు తెలిపారు. 11 గురువారాలు గురుచరిత్రను పారాయణ చేసి, 12వ వారం (సెప్టెంబర్ 21) సాయి సచ్చరిత్రను పారాయణ చేస్తారు. ఈ విధంగా 12 వారాలు పారాయణలో పాల్గొన్న భక్తులకు ఆఖరి రోజున సాయి సచ్చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.